క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి: మండల పరిధిలోని ఏడు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ షేక్ అజహర్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కనగాల గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి, గుళ్లపల్లి, చెరుకుపల్లి, ఆరుంబాక, కావూరు గ్రామాలకు విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలన్నారు.

19న మండల సర్వసభ్య సమావేశం

చెరుకుపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు చెప్పారు. సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చింటం జరుగుతుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు దిగువస్థాయి సిబ్బందిని పంపకుండా వారివారి శాఖల యొక్క ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు సీజ్ చేసిన సంఘటన మండలంలోని పెసర్లంకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంక కృష్ణా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేమూరు సెబ్ ఎస్‌ఐ రాజేశ్వరి పెసర్లంక అడ్డరోడ్డు వద్ద నిలువరించారు. ఇసుక ట్రాక్టర్‌ను కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. సెబ్ ఎస్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కొల్లూరు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుకు కేసు బదిలీ చేసినట్లు కొల్లూరు ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

దుప్పట్లు పంపిణీ



కర్లపాలెం: ఆట్ల బ్రహ్మానందరెడ్డి స్ఫూర్తితో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు ఆట్ల బ్రహ్మానందరెడ్డి వర్ధంతి సందర్భంగా కర్లపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మోపర్తి జాన్ సహకారంతో రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బన్నారావూరి శ్రీనివాసరావు, టి.పెద్దిరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఎ.రాంబాబురెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, ఎ.శివన్నారాయణరెడ్డి, జగన్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



కర్లపాలెం: ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వారికి వైఎస్సార్ బీమా పథకం ఆర్థిక భరోసా కల్పిస్తుందని నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడా సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన దూపాటి శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా శ్రీనివాసరావు భార్య దయమ్మకు బుధవారం సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సాంబశివరావు రూ.10వేల నగదు అందజేశారు. మిగిలిన నగదు రూ.90వేలు త్వరలో కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సోలార్ లైట్లు పంపిణీ



బలిజేపల్లి(వేమూరు): ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రజలు కరెంట్‌పోయిన తర్వాత ఇబ్బందులు పడకుండా చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ క్రాఫ్ సంస్థ ఆధ్వర్యంలో సోలార్ టైట్లు పంపిణీ చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరావు, డాక్టర్ రోజ్ లాండ్ అన్నారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి, వరాహాపురం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాత్రిళ్లు కరెంట్ పోయిన తర్వాత ప్రజలు ఇబ్బందులు పడకుండా సోలార్ లైట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సంస్థ ప్రోగామ్ మేనేజరు ఎస్.శ్రీనివాసరావు, సీఆర్పీ వీరయ్య, వేణు, కో– ఆర్డినేటర్ కీర్తన పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల
- మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల

నిజాంపట్నం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. అర్హత ఉండి సాంకేతిక లోపాలవల్ల సంక్షేమ పథకాలు అందకపోతే వారిని గుర్తించి సంక్షేమపథకాలు అందేలా చేడాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబు, ఎంపీడీఓ నాగలక్ష్మి, తహసీల్దార్ నెహ్రూబాబు, ఫిషరీస్ జేడీ సురేష్, నాజర్‌ఖాన్, మండల వైస్ ఎంపీపీ ఉన్నవ వెంకటేశ్వరరావు, తోటకూర సుబ్బారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు ప్రభుత్వ శాఖ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సాహితీలోకంలో చిరంజీవి శారద

నేడు శారద వర్ధంతి సందర్భంగా...



చిత్రకారుడు చంద్ర గీతల్లో శారద



శారద (ఎస్. నటరాజన్)

తెనాలి: 'సాధారణంగా మేము శారద నవలను 19వ శతాబ్దపు గొప్ప రష్యన్ నవలలతో పోల్చేవాళ్లం. ముఖ్యంగా డాస్టొయెవ్‌స్కీ నవలలతో. శారద తెలుగువాడు కాదని తమిళుడని, అసలు పేరు నటరాజన్ అని, తెలుగు నేర్చుకుని తెలుగు రాశాడని తెలిసి అతడి మీద మా గౌరవం పెరిగింది. అతడు తెనాలిలో హోటల్ సర్వరుగా పనిచేస్తున్నాడని, కటిక పేదరికం అనుభవిస్తున్నాడని తెలిసి ఇంకా పెరిగింది. అతని నవల డాస్టొయెవ్‌స్కీ నవలల్లా ఉందనుకోవటమేకాక, డాస్టొయెవ్‌స్కీలాగా శారదకూ మూర్ఛవ్యాధి వుందని తెలిసినప్పుడు బాధతోపాటు, ఆ పోలిక సరిగానే ఉందనిపించింది.'

తెలుగు కథకుల్లో ఒక మెరుపులా...

తెలుగు కథకుల్లో ఒక మెరుపులా అతి స్వల్పకాలంలోనే ఉప్పెనలా విరుచుకుని వచ్చిన శారద, ఎందరినో విభ్రాంతులను చేశాడు. ఇంగ్లిష్ రచనల అనువాద సాహిత్యం తెలుగు పత్రికలకు జాడ్యంలా తయారైన కాలంలో సాహిత్య ఖండమనదగ్గ శారద స్వతంత్ర నవల 'మంచీ చెడు' ఒక అపూర్వ సంచలనం. అందుకు సుప్రసిద్ధ పత్రికా సంపాదకుడు నండూరి రామమోహనరావు ప్రత్యక్ష సాక్షి. శారద నవలల్ని సీరియల్‌గా ప్రచురించి, ఆ నవలల్ని, ఆయన పేరును తెలుగునాట విరివిగా ప్రాచుర్యంలోకి వచ్చేందుకు కారకులు నాటి ఆంధ్రపత్రిక సంపాదకుడు సూరంపూడి సీతారాం. ఉపసంపాదకుడు నండూరి రామమోహనరావు. 2003లో విజయవాడ సాహితీ మిత్రులు నిర్వహించిన జ్ఞాపకాల సభకు రాసిన వ్యాసంలోనే శారదను, రష్యన్ రచయిత డాస్టొయెవ్‌స్కీతో పోల్చారు రామమోహనరావు. తెలుగు నవలా సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పిన వారిలో శారద ఒకరనీ, ఆ నవలలు తెలుగులో స్వతంత్ర నవలలు వచ్చేందుకు దోహదపడ్డాయని స్పష్టంచేశారు.

శారద అసలు పేరు ఎస్.నటరాజన్. పూర్తిపేరు సుబ్రమ్మణ్యయ్యరు నటరాజన్. 1937లో బతుకుదెరువు కోసం తండ్రితో కలిసి తెనాలి చేరాడు, హోటల్ కార్మికుడిగా చాలీచాలని సంపాదనతో తండ్రిని పోషించాడు. పదిహేనేళ్ల వయసులో తండ్రి పోవడంతో క్షోభతో మూర్ఛరోగానికి గురయ్యాడు. హోటల్ వృత్తిలో వుంటూనే తెలుగు నేర్చాడు. నాటి తెలంగాణ పోరాటం, ఆర్థికమాంద్యం, సామాజిక సంక్షోభాలు, కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలతో ఆయన సాహిత్య సృజన వేయిరేకులై వికసించింది. హోటల్‌లో వంటమాస్టరుగా, కళాయితో బజ్జీలు వేయటం, బస్టాండులో నెత్తిమీద కుండతో మజ్జిగ విక్రయించినా, ఏమాత్రం ఖాళీ దొరికినా పుస్తకాలు చదువుతూనో, రాస్తూనో గడిపాడు.

భౌతికజీవితం 30 ఏళ్లయితే...

భౌతికజీవితం 30 ఏళ్లయితే సాహిత్యజీవితం ఏడేళ్లు మాత్రమే. ఆ వ్యవధిలోనే శారద కలంపేరుతో నూరుకు పైగా కథలు, ఆరేడు నవలలూ రాశారు. మంచీచెడూ, అపస్వరాలు, ఏది సత్యం, మహీపతి, సందేశం, నాగరికుని ప్రేమ, అందాలదీవి నవలలు నాటి రోజుల్లో సంచలనం. హోటల్ వర్కర్, నరబలి వంటి నాటికలు, క్షణంలో సగం పేరుతో వంద వరకు రాజకీయ చెణుకులు, అనేక గల్పికలు శారద కృషిని తెలియజేస్తాయి. సమస్త జీవితం గాయాలమయమై ఎన్నెన్నో నిరాదరణలకూ, హేళనలకూ గురవుతూ ఎన్నో వత్తిళ్లలోంచి, దుఃఖంలోంచి జీవిత పోరాటమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా పలవరించాడు శారద. తెలుగువాడు కాకున్నా అతడు తన రచనల్లో అంత గొప్పగా తెలుగుతనాన్ని పంచటం ఆశ్చర్యకరం. రచనల్లో చిత్రించిన తెలుగు జీవితం, తెలుగు వాతావరణం, తెనాలి, విజయవాడ, గుడివాడ వంటి కథాస్థలాలను అతడు ప్రస్తావించిన తీరు, కథల్లోని వాస్తవికతకు ఎంతో దోహదపడ్డాయి. అందుకే శారద 1955లోనే కన్నుమూసినా, తన రచనలతో చిరంజీవిగానే ఉండిపోయారు. తెలుగును నేర్చుకుని, తెలుగువారి జీవితంతో మమేకమైన రచనలు చేసిన 'శారద'లా తెలుగువారి అభిమానాన్ని చూరగొన్న మరొక రచయిత లేరనడం అతిశయోక్తి కాదు. నేటికీ ఆయన రచనలను ఇష్టపడి చదివే పాఠకులున్నారు. 'ప్రతి నిరుద్యోగిలోనూ, అన్నార్తునిలోనూ, దిగుళ్లతో సమసిపోతున్న ప్రతి రచయితలోనూ శారద జీవించే ఉన్నాడు'– శారద మిత్రుడు, జ్ఞానపీఠ్ అవార్డుగ్రహీత రావూరి భరద్వాజ అనేవారు.

1955, 1963, 1998లో దేశీ కవితా మండలి, ఆదర్శ గ్రంథమండలి, శారద సాహిత్యవేదిక శారద సాహిత్యాన్ని ప్రచురించాయి. మిత్రుడు ఆలూరి భుజంగరావు రచన 'సాహిత్య బాటసారి శారద' తన సహచరుడి జీవితాన్ని, నాటి పరిస్థితులను కళ్లకు కట్టింది. 2015లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) శారద మూడు నవలలతో 'శారద రచనలు' తీసుకొచ్చింది. అదేవిధంగా రక్తస్పర్శలోని 35 కథలు, సేకరించిన మరో 17 కథలు, మరికొన్ని గల్పికలు, ఒక రూపకం, లేఖలు, కవితలతో 'శారద సాహిత్యం' (కథలు, గల్పికలు, లేఖలు)ను అరసం ప్రచురించింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కర్లపాలెం: ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండల కేంద్రం కర్లపాలెంలో చోటు చేసుకుంది. బాధితుడి కుమారుడు సతీష్ తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం పాత చేపల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న సురేష్, సువర్ణ దంపతులకు ఇద్దరు పిల్లలు. వీరి మధ్య వివాదాలు ఉండటంతో సువర్ణ బాపట్లలోని తన అక్క వద్ద ఉంటుంది. కుమారుడు, కుమార్తెతో సురేష్ ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో సురేష్ తమ నివాసాన్ని విక్రయించడంతో విషయం తెలిసిన సువర్ణ తన అక్కతో కలిసి వచ్చి భర్త సురేష్ తో గొడవపడి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు సివిల్ వివాదం కావడంతో వారిరువురూ తేల్చుకోవాలని సూచించారు. మొదట సువర్ణను, ఆమె అక్కను బయటకు పంపించి, అనంతరం సురేష్‌ను పంపించారు. అయితే అర్ధగంటపాటు తన్ను పోలీస్ స్టేషన్‌లో ఉంచడంపై మనస్థాపం చెందిన సురేష్ మంగళవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుమారుడు సతీష్ ఆస్పత్రికి తరలించాడు. ఈ విషయమై కర్లపాలెం ఎస్‌ఐ శివయ్యను 'సాక్షి' వివరణ అడుగగా భార్య భర్తలను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడిన విషయం వాస్తవమేనని, ఇరువురు గొడవపడకుండా ఉండేందుకే ముందుగా సువర్ణను పంపి తరువాత సురేష్‌ను బయటకు పంపించామని తెలిపారు.

గౌతు లచ్చన్న సేవలు అజరామరం

గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివనాగబాబు



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాటూరి శివనాగబాబు

రేపల్లె: స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో, స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధిలో సేనానిగా పని చేసిన సర్దార్ గౌతు లచ్చన్న సేవలు ఎనలేనివని గౌడ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటూరి శివనాగబాబు అన్నారు. పట్టణంలోని కాటూరి రెసిడెన్సీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాడు జాతీయ నాయకులతో కలిసి దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అనేక మార్లు జైలుకు వెళ్లారన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి ముఖ్యంగా కార్మికుల పిల్లల చదువుకు ఆయన చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. మహాత్మ గాంధీ పిలుపునిచ్చిన ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం తదితర ఉద్యమాలలో ఆయన పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు కేసన రాంబాబు, కేసన రామకృష్ణ, దాసరి అమర్‌నాథ్, చెన్ను నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆ పోలీసుల తీరే వేరు!

తెనాలి: తెనాలి పట్టణంలో ఏళ్లుగా తిష్టేసిన కొందరు పోలీసుల తీరే వేరుగా ఉంది. వారి వ్యవహారాలు చూస్తుంటే డిపార్టుమెంటులో కోవర్టులున్నా రా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం ఆ కోణంలో పరిశీలింపజేస్తున్నారనేది విశ్వసనీయ సమాచారం. ఎప్పటినుంచో పాతుకుపోయిన కొందరు పోలీసు సిబ్బంది వ్యవహారాలు అధికారపార్టీ ముఖ్య నేతల దృష్టికి రావడంతో వారు ఉన్నతస్థాయికి కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తాజాగా పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత ఉన్నత అధికారుల ప్రమే యం లేకుండా, పలు అంశాలను వారి దృష్టికి రానీయకుండా కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. తమకు తప్పు డు పనులకు అనుకూలంగా మలుచుకునేందుకు, ప్రభుత్వానికి మచ్చతెచ్చేలా వారి వ్యవహారాలు ఉంటున్నాయని ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయనేది విశ్వసనీయ సమాచారం. ప్రతిపక్ష నేతల కుటుంబ ఆస్తి తగాదాల్లో తలదూరుస్తూ ఎవరో ఒకరి వైపు కొమ్ముకాస్తూ డబ్బులు దండుకునేందుకు అనుకూలంగా వ్యవహరిస్తుండడం అధికారపార్టీకి తలనొప్పులు తెస్తున్నాయి. రహస్యంగా పేకాట శిబిరాలకు అండనిస్తూ సొమ్ము చేసుకుంటుండటం, ఏదైనా జరిగితే ప్రభుత్వంపై బురద చల్లేలా అదే పోలీసులు మీడియాకు లీకులు ఇస్తున్నారని ఉన్నతాధికారుల చెవికి చేరిందంటున్నారు. ఓ ఘటనలో జిల్లా ఎస్పీ స్వయంగా ఇక్కడకు విచారణాధికారిని పంపాల్సి వచ్చిందంటే పరిస్థితిని అంచనా వేయ వచ్చు. పట్టణంలో కొన్ని నెలలుగా జరుగుతున్న పలు సంఘటనలు ఇందుకు ఆస్కారమిస్తున్నాయి కూడా.

స్థానికుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం...

స్థానిక వార్ఫ్‌రోడ్డులో టింబర్ వ్యాపారం చేస్తుండే జనసేన నాయకుడు తోటకూర వెంకట రమణారావు, ఆయన సోదరి ఝాన్సీలక్ష్మి మధ్య ఆస్తివివాదం ఉంది. ఆమె భర్త టింబర్ షాపు కూడా అక్కడే ఉంది. ఒకరోజు ఝాన్సీలక్ష్మి, తన ఇద్దరు కుమార్తెలతో కలిసి అక్కడకు వెళ్లారు. బయటకు వెళ్లాలంటూ రమణారావు ఒకపక్క బెదిరిస్తూనే పోలీసులకు ఫోన్ చేశారు. నిమిషాల వ్యవధిలోనే అక్కడకు ఏఎస్‌ఐ పరుచూరి శ్రీనివాసరావు (బుల్లెట్ శ్రీను), కానిస్టేబుళ్లు నరసింహారావు, రంజిత్‌లు వచ్చేశారని, వాస్తవానికి ఆ ప్రాంతం త్రీటౌన్ పోలీస్‌స్టేషను పరిధిలోనిదని అధికారులకు ఫిర్యాదులు అందాయి. టూ టౌన్ ఏఎస్‌ఐ బుల్లెట్ శ్రీను, కానిస్టేబుల్ నరసింహారావు అక్కడకు రావటమే కాదు... మహిళలని కూడా చూడకుండా దుర్భాషలాడారనే తీవ్రారోపణలు ఉన్నాయి. బలవంతంగా స్టేషనుకు తీసుకెళ్లే ప్రయత్నంలో కిందపడిన ఝాన్సీలక్ష్మి గాయపడడం, దీనిపై న్యాయం కోసం కొన్నినెలలుగా తిరిగినా ఫలితం లేకపోవడంతో జిల్లా ఎస్పీకి మొరపెట్టుకున్నారు. ఈ కేసు విచారణకని ఎస్పీ ఒక డీఎస్పీని నియమించగా కొద్దిరోజుల క్రితం విచారణ అధికారి తెనాలి వచ్చి ఝాన్సీలక్ష్మి, కుమార్తెలను విచారించారు కూడా. ఇటీవల త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కల్యాణ మండపం లీజుదారుకు, యజమానికి మధ్య వివాదం ఏర్పడింది. లీజుదారుడి నుంచి డబ్బులు దండుకున్న పోలీసులు, సివిల్ వ్యవహారమంటూ తప్పుకున్నట్టు ఆరోపణలున్నాయి. దీంతో సదరు యజమాని బయట వ్యక్తులను ఆశ్రయించి, పనిచేయించుకున్నట్టు వెల్లడైంది. కొందరు పోలీసుల అండదండలతో పట్టణంలో పేకాట శిబిరాలు నడుస్తున్నాయని తేటతెల్లమైంది. టూ టౌన్ పరిధిలో ఇలాంటి ఓ శిబిరంపై ఇటీవల 'సెబ్' పోలీసులు దాడిచేశారు. ఇదే స్టేషను పరిధిలోని నందులపేటలో తెలుగు తమ్ముడు ఒకరు పేకాట నడిపిస్తున్నాడంటే ఆ పోలీసుల అండతోనేనని ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది.

ఏదైనా ఘటన జరిగినప్పుడు...

ఏదైనా ఘటన జరిగినప్పుడు ప్రభుత్వాన్ని డామేజ్ చేసేందుకు మీడియాకు పోలీసులే తప్పుడు లీకులిస్తున్నారు. ఇటీవల నందులపేటలోని ఓ అపార్టు మెంటులో ఇద్దరు ముఠావాళ్లపై గంజాయ్ బ్యాచ్ దాడిచేసింటూ పత్రికలు, మీడియాలో వచ్చిన కథ నం ఇందుకు నిదర్శనం. అక్కడ పనిచేస్తున్న ఇద్దరి కి, దారంట వెళ్తున్న యువకుడికి మధ్య మాటా మాట పెరిగి, యువకుడిని కొట్టారు. దాంతో ఆ యువకుడు స్నేహితులను పిలిచి, ఇద్దరిపై ప్రతిదాడి చేశాడు. దీంతో ఆ ఇద్దరూ అపార్టుమెంటులోకి పరుగులు దీశారు. గంజాయ్ తీసుకున్న యువకుల దాడిగా ఎల్లో మీడియా చిత్రీకరించింది. పోలీసు సిబ్బంది ఇచ్చిన లీకులే ఇందుకు కారణమని పై అధికారుల దృష్టికి వెళ్లింది. కొందరు సిబ్బంది కారణంగానే ఇన్ని రకాల అనర్థాలు జరుగుతున్నాయని పోలీసుల్లోనూ చర్చ నడుస్తోంది. ఈవిషయమై ఉన్నతాధికారిని వివరణ కోరగా అన్ని కోణాల్లోనూ పరిశీలింపజేస్తున్నామన్నారు.

19న బుద్ధాం ఆరోవార్డుకు ఉప ఎన్నిక



బేతపూడిలో ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్నికల అధికారి

కర్లపాలెం: ఈనెల 19వ తేదీన బుద్ధాం గ్రామ పంచాయతీలోని 6వ వార్డుకు ఉప ఎన్నిక జరగనుందని ఎన్నికల అధికారి ఫైజుద్దీన్ తెలిపారు. 6వ వార్డు మెంబర్‌గా పనిచేస్తున్న మిద్దిబోయిన అగ్గిరాముడు అనారోగ్యంతో మృతిచెందటంతో ఇప్పుడు ఈ ఉప ఎన్నిక జరుగుతుందని ఆయన తెలిపారు. 6వ వార్డుకు జరిగే ఎన్నికలలో మిద్దిబోయిన శ్రీనివాసరావు, నర్రా వెంకటేశ్వర్లు పోటీ చేస్తున్నారని చెప్పారు. ఈనెల 19న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నిక జరుగుతుందని 2గంటల నుంచి ఓట్లు లెక్కించి గెలుపొందిన వారి పేరు ప్రకటిస్తామని చెప్పారు.

ఏకగ్రీవమైన పేరలిపాడు 10వ వార్డు...

పేరలిపాడు పంచాయతీలోని 10వ వార్డు ఏకగ్రీవమైనట్లు ఫేజ్–1 ఎన్నికల అధికారి ఎ.ఎలీషాబాబు తెలిపారు. 10వ వార్డు మెంబర్ పేరలి సురేష్ మృతిచెందటం వలన ఇప్పుడు ఉప ఎన్నిక జరుగుతుందని ఆయన తెలిపారు.

10వ వార్డుకు కాగిత చార్లెస్, జోగి సుబ్బారావు నామినేషన్ దాఖలు చేయగా జోగి సుబ్బారావు నామినేషన్ చెల్లకపోవటంతో కాగిత చార్లెస్ ఏకగ్రీవమైనట్లు ప్రకటించి ధ్రువీకరణపత్రం ఇచ్చినట్లు ఎన్నికల అధికారి ఎలీషాబాబు తెలిపారు.

బేతపూడి ఏడో వార్డుకు...

రేపల్లె: బేతపూడి పంచాయతీలోని 7వవార్డుకు ఈ నెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివపార్వతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండలంలోని పలు పంచాయతీలలో ఖాళీ అయిన వార్డు మెంబర్లకు ఎన్నికలకు నామినేషన్‌ల ప్రక్రియ నిర్వహించగా చాట్రగడ్డ, రాజుకాల్వ పంచాయతీలలో ఆయావార్డులలో ఒక్కో నామినేషన్ దాఖలు కావటంతో ఏకగ్రీవమయ్యాయన్నారు. బేతపూడి 7వవార్డుకు ఇద్దరు అభ్యర్థులు అమర్తలూరి సుజ్ఞానం, డి.మార్తకుమారిలు పోటీలో ఉన్నారని చెప్పారు. 19 ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఎన్నికలలో 144 మంది మహిళలు, 113 మంది పురుషులు మొత్తం 257 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారని చెప్పారు. అనంతరం ఎన్నికల అధికారి సిబ్బందికి శిక్షణనిర్వహించారు.

మంచినీటి చెరువులో చేపల వేట



వలలో చిక్కిన భారీ చేపలు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): నిబంధనలకు విరుద్ధంగా కొందరు మంచి నీటి చెరువులో చేపల వేట చేపట్టారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు రక్షిత మంచినీటి చెరువులో తాగునీరు అడుగంటాయి. దీంతో స్థానికులు చెరువులో చేపలు ఉన్నాయని, బహిరంగ వేలం నిర్వహిస్తే పంచాయతీకి ఎంతో కొంత ఆదాయం వస్తుందని స్థానిక పంచాయతీ అధికారులకు తెలిపారు. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చెయ్యలేదు. మంచినీటి చెరువులో చేపలు పట్టకూడదన్న కారణాన్ని చూపి వేలాన్ని విస్మరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కొందరు జాలర్లు చెరువులోకి దిగి పెద్ద పెద్ద చేపలను పట్టి, అక్కడికక్కడే చేపలను బహిరంగంగానే విక్రయించారు. ఒక్కో చేప భారీగా ఉందని స్థానికులు తెలిపారు. అయితే పంచాయతీ అధికారులకు విషయం తెలియడంతో సిబ్బందిని పంపి జాలర్లను పంపివేశారు. కాగా పట్టపగలు బహిరంగంగా కొందరు వ్యక్తులు మంచినీటి చెరువులో చేపలు పట్టడంపై స్థానికుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారుల సహకారంతోనే జాలర్లు చేపలు పట్టి ఉంటారన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇటీవలే ఆ పంచాయతీలో నిధుల దుర్వినియోగం విషయంలో టీడీపీ సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే.

వట్టిచెరుకూరు పీఎస్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, ఎస్‌ఐ కోటేశ్వర రావుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

గుంటూరు రూరల్: గ్రామాల్లో శాంతికమిటీలను ఏర్పాటు చేసి శాంతి భద్రతలను కాపాడే దిశగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ సూచించారు. బుధవారం సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని వట్టిచెరుకూరు మండల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. వట్టిచెరుకూరులో నూతన పోలీసు స్టేషన్ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ తీర్మానం చేసి, ఆమోదం పొందిన స్థలాన్ని పరిశీలించి పోలీసు స్టేషన్ నిర్మించే దిశగా తదుపరి కార్యక్రమం నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన కొంతమంది ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో నమోదైన కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, ఇతర విశేషాలను స్థానిక ఎస్‌ఐ కోటేశ్వరరావుని అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ సీఐ సుబ్బారావు, స్థానిక ఎస్సై కోటేశ్వరరావులకు పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల నుంచి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఫిర్యాదులను పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదుకు తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్‌లో రాయడం, రశీదు ఇవ్వడం చేయాలన్నారు. పోలీసు స్టేషన్‌లో న్యాయం జరుగుతుందని అనే నమ్మకం ప్రజలకు ఫిర్యాదుదారులకు కలిగించాలని ఎస్‌ఐకు సూచించారు. స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ ఒక గ్రామం విజిట్ చేసి ఆ గ్రామానికి సంబంధించిన సమాచారం తెలుసుకుని ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకోవాలన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

రూ. 1.70 లక్షలు విలువ చేసే మద్యం, కారు సీజ్



స్వాధీనం చేసుకున్న కారు, మద్యం సీసాలు, నిందితుడితో సెబ్ అధికారులు

కొల్లూరు: అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు భారీగా మద్యం సీసాలను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన కొల్లూరులో చోటుచేసుకుంది. సెబ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరుకు చెందిన షేక్ మస్తాన్‌వలి కారు ట్రావెల్స్ నడుపుతూ, అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయాలు చేపడుతున్నాడు. తన ట్రావెల్స్‌కు చెందిన కారు గన్నవరం విమానాశ్రయానికి కిరాయికి వెళ్లిన సమయంలో అక్కడ నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాంకు వెళ్లి అక్కడ నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి తీసుకువస్తూ ఉంటాడు. నిందితుడు కొల్లూరు పరిసర గ్రామాలలో పాండిచ్చేరి మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సెబ్ అధికారులకు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేశారు. అగష్టు 15న డ్రై డే సందర్భంగా మద్యం దుకాణాలు మూసి ఉండటం వలను మద్యానికి డిమాండ్ పెరుగుతుందన్న ఉద్దేశ్యంతో యానం నుంచి భారీగా మద్యం తన కారు ద్వారా తరలించి కొల్లూరు జెండా చెట్టు సమీపంలోని అతని గృహం వద్ద ఉంచాడు. భారీగా మద్యం దిగుమతి అయినట్లు గుర్తించిన వేమూరు సెబ్ సీఐ కె.రవీంద్ర తన సిబ్బందితో కలసి మంగళవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించి నిందితుడి గృహంతో పాటు వాహనాల్లో తనిఖీలు నిర్వహించారు. సెబ్ అధికారుల తనిఖీల్లో కారులో ఉంచిన రూ. 1.70 లక్షలు విలువైన పలురకాల బ్రాండ్‌లకు సంబంధించిన 192 ఫుల్ బాటిళ్లను, మద్యం అక్రమంగా తరలించడానికి వినియోగించి మద్యం నిల్వ చేసి ఉంచిన కారును సీజ్ చేశారు. కేసు నమోదు చేసిన సెబ్ సీఐ రవీంద్ర నిందితుడ్ని తెనాలి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు. దాడుల్లో వేమూరు సెబ్ ఎస్‌ఐ పి.రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.